
# సాయం!

## 13



**రిసెప్షనిస్టు** సుంధర అడుగుల చప్పుడు సీనియర్ ఆఫీసరు శివప్రసాదుకు గుర్తే.

"ప్లీజ్ సిడౌన్" అన్నాడు తలెత్తకుండానే. కాని ఆవిడ కూర్చోలేదు. అలా కూర్చోకూడదు, ఆ ఆఫీస్ రూల్స్ ప్రకారం. ఆ విషయంలో ఆవిడే కాదు అతనూ ఏం చెయ్యలేడు. తలమునకలైన ఆఫీసు పనిలో ఎంతగా ఊపిరి సలపకపోయినా ఆవిడ సమక్షంలో వాళ్ళిద్దరి మధ్య తేడా అతను తలపోసుకోకుండా ఊరుకోలేడు.

తను ఇలా మెత్తని కుర్చీలో కూర్చోడం, ఆవిడ అలా నిలబడ్డం - ఇది కాదు, బతుకు పోరాటాన్ని ఎరుక్కొనే మానసిక బలాన్ని బట్టి హొదాలు, నిర్ణయించగలిగితే ఆమెను ఇంకా ఎత్తున కూచోబెట్టి, తనకు కటిక నేల మీద జాగా ఇవ్వాలని శివప్రసాద్ ఉద్దేశం.

తనకేం మగాడు ! తల్లీదండ్రీ లేకపోతే నేం పిల్లలు లేని పిన్నీ చిన్నాన్నలు ప్రేమతో పెంచి పెద్ద చేశారు. చదువు చెప్పించారు. పెళ్ళి చేశారు. సొంతిల్లు ఉంది. మంచి ప్రైవేట్ ఫర్మ్‌లో పెద్ద ఉద్యోగం కారూ, బంగళా, దేనికి లోటని?

తను ఎప్రంటిస్‌గా ఆ ఫర్మ్‌లో చేరేనాటికి వసుంధర భర్త గవర్రాజు కెమిస్ట్‌గా అక్కడ పని

చేస్తూ ఉండేవాడు. ఇంజనీరింగ్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేశాడు గనక తనకు రెండేళ్ళలోనే ప్రమోషన్ వచ్చింది. తనకు పెద్ద ఉద్యోగం వచ్చిన ఏడాదే ఆ ఘోరం జరిగింది. ఓ గ్యాసు లీకు యాక్సిడెంటులో మరో ఇద్దరు అసిస్టెంట్స్‌తో పాటు గవర్రాజూ ఘోర మరణానికి గురి అయ్యాడు. అప్పుడు వసుంధర పెద్ద కొడుక్కి నాలుగో ఏడు. రెండోవాడికి మూడు. ఒళ్ళో మూడు నెలల పాప. ఫర్మ్ రూల్సు ప్రకారం ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తారు. చెల్లించారు కూడా. ఆవిడ ఏ ఎనిమిది దాకానో చదివింది. బతికున్నన్నాళ్ళూ పెళ్ళాం కాలుకదపకుండా నెత్తి మీద పెట్టుకుని చూసుకున్నాడు గనక వసుంధరకు వచ్చిన హిందీ కూడా అంతంతమాత్రమే అప్పటి ఆమె క్వాలిఫికేషన్‌ను అంతే.

స్వతహాగా తనేమో తన పనేమో తప్ప గట్టిగా ఎదుటివాడితో నైనా రెండు ముక్కలు మాటాడ్డం శివప్రసాద్‌కి అలవాటు లేదు. అయినా గవర్రాజు కుటుంబం కోసం రంగంలోకి దిగాడు. పెద్దింటి పిల్ల కదా క్లాస్ ఫోర్ ఉద్యోగానికి వసుంధర ఒప్పుకోదేమో పిల్లలతో కుదరదేమో అని సందేహించాడు. క్లాస్‌ఫోర్ వాళ్ళకు క్వార్టర్ల సదుపాయం ఆ రోజుల్లో లేదు. ఫర్మ్ వాళ్ళు తగిలేస్తా రేమో, బొంబాయి లాంటి ఊళ్ళో ఏ పంచా దొరక్క పిల్లలతో ఎక్కడ ఇబ్బంది పడుతుందో అని కంగారు పడ్డాడు. కాని సీరియస్‌నెస్‌కే, సిన్సియారిటీకీ మారు పేరైన తన మాట ఫర్మ్ మేనేజ్‌మెంటు పెద్ద మనసుతో మన్నించింది. ఎప్పుడూ లేని మధ్యవర్తిత్వం వహించి విధి వంచితులైన ఆ తల్లీపిల్లల్ని వీధి పాలు కాకుండా కాపాడగలిగాడు.

ఏ మనిషికయినా ఏ స్థితిలో అయినా ఇంకొకరి సహాయం అనేది కొంతవరకే. సాటి మనిషి శాశ్వతంగా సహాయం కోరడం, కళ్ళబడని అదృశ్యశక్తి మీద మూఢ విశ్వాసం ఉంచడం మనిషిలోని బలహీనతలను చూపిస్తుంది. వసుంధరలో ఈ రెండూ మాటవరస కయినా కనిపించవు. అందుకే శివప్రసాద్ దృష్టిలో ఆమె కంతటి అత్యున్నత స్థానం. భర్త పోయేనాటికి పెనుగాలిలో చిక్కుకున్నలేత మొక్కలాంటి వసుంధర ఈ పదమూడు పద్నాలుగేళ్ళలో ఒకరికి నీడ చూపించే వృక్షంలా తన కళ్ళ ముందే ఎదగడం ఎంతో ఆశ్చర్యంగా ఆనందదాయకంగా ఉంటుంది. తనేదో పెద్ద ఉద్ధరించాడనుకోడం వెర్రితనం. ఒకసారి తన కాళ్ళ మీద తను నిలబడగలిగాక ఇక ఎవర్నీ దేనికీ యాచించలేదు ఆవిడ. పిల్లల ముగ్గుర్నీ ఎవరైనా గర్వపడేలా పెంచింది. పెద్ద పిల్లలిద్దరూ ఇంటరు పస్టు క్లాసులో పాసయారు. వాళ్ళిద్దరూ ఇప్పుడు ఏదో కోచింగ్ సెంటర్లో సికింద్రాబాద్‌లో ఎమ్‌సెట్ పరీక్షకు ప్రిపేర్ అవుతున్నారు. ఇక తల్లి దగ్గిరే ఉండే బేబీ అయితే ఆ చురుకుదనం చూసి ముచ్చటపడని వారుండరు. దానికి రాని భాష లేదు, అది ఆడని ఆట లేదు ! ఇక వసుంధర అయితే ప్రైవేటుగా కట్టి ఎప్పుడో పూర్తి చేసింది గ్రాడ్యుయేషన్. టైపు హయ్యర్ పాసయింది. హిందీలో విశారద పరీక్ష పాసయింది. సీనియర్ రిసెప్షనిస్టుగా ప్రమోటై రెండు వేలు తక్కువ కాకుండా తెచ్చుకుంటోంది. ఒకర్ని ఒక మాట అనదు, ఒకరిచేత ఒక్క మాట పడదు. ఉద్యోగరీత్యా ఎంత టెన్షన్ ఏర్పడ్డా మొహం మీద ఆ చిరునవ్వు చెదరనివ్వదు.

తనేదో ఆవిణ్ణి నిలబెట్టానని అందుకే శివప్రసాద్ ఎప్పుడూ అనుకోడు. అవకాశం వచ్చినా ఆవిడకు తోడ్పడి తీరాలనే తపన అతని బలహీనతేమో మరి!

" ఈ రాత్రికే రిజర్వేషన్స్ దొరికేయి సార్! నేనూ, బేబీ ఇవాళే బయలుదేరి వెడుతున్నాం. ఫైవ్ డేస్ లీవ్‌కు అప్లై చేశాను. ఈ సంక్రాంతి పిల్లల్తో సికింద్రాబాదులో గడిపి వస్తాను. మళ్ళీ నేను సోమవారం డ్యూటీలో జాయిన్ అవుతాను. ఫైల్సన్నీ మేరీకి అప్ప చెప్పేను. పెండింగ్‌లో ఉన్న టైపింగ్

మేటరంతా అరుణ్ బిస్వాల్‌కి ఇచ్చాను. మరి నేను వెళ్ళి రానా సార్?"

వసుంధర నోరు విడిచి అడక్కుండానే తను చేయగల సాయం అతని మనసులో మెదిలింది.

వసుంధర కొడుకులిద్దరూ తల్లికి బాగా దూరంగా ఆ మహా పట్నంలో చదువులు వెలిగిస్తున్నారు. ఎంత క్రమశిక్షణలో ఉన్న పిల్లలైనా పెద్దల డబ్బు నెల నెలా అందుతూంటే ఈ కాలపు ఆకర్షణలకు తట్టుకుని వయ సొస్తున్న పిల్లలు ఓ దార్లో పడడం అంత సుళువా! తన పిన్నీ, చిన్నాన్నా ఈ మధ్యే తన సొంతింటికి వచ్చేశారని తెలియబరచారు. అన్నట్టు చిన్నాన్న రిటైరయి పదేళ్ళయినా ఇంకా మహా ఏక్టివ్‌గా ఉండి ఉండాలి. లేకపోతే ఇలా వస్తునే ఓ మేథమెటిక్స్‌కోచింగ్ సెంటరు ఓపెన్ చేస్తాడా! అంతేకాదు. వాళ్ళింట్లో ముందు వాటా వాళ్ళు ఖాళీ చేశారని పిన్ని రాసింది. వసుంధర కొడుకులు ఎలాగూ నాలుగొందలు ఇచ్చి వేరే వాటాలో ఉన్నారని ఆవిడే చెప్పింది. వాళ్ళని తమ వాటాలో దింపి చిన్నాన్న సంరక్షణలో పెడితే? మగపిల్లలు చేతి కంది వస్తే ఇక బేబీ భారం ఒకటే ఆవిడకు మిగులుతుంది.

ఒకరి సహాయం ఆర్థించని పద్ధతిలో ఆవిడ తన జీవితం దిద్దుకుంది. ఇవన్నీ చెప్పి తమవాళ్ళ సాయం పొందమంటే ఆవిడ ఎలాగూ వినదు. అన్నీ వివరంగా రాసి వసుంధర చేతికిస్తూ శివప్రసాదు అన్న దిదీ:

"నన్నింతవాడిని చేసిన మా వాళ్ళు సికింద్రాబాదులో ఉన్నారు. 'ఇదిగో ఎడ్రసు. మా క్షేమం తెలియజేస్తూ ఆ ఉత్తరం మా చిన్నాన్నకివ్వండి!"

శివప్రసాదు చెప్పిన ఎడ్రసు పట్టుకుని, సికింద్రాబాదు చేరిన మూడో రోజున వసుంధర ఆ ఇంటికి వెళ్ళి వాళ్ళను కలుసుకుంది. అతనిచ్చిన ఉత్తరం వాళ్ళ కందజేసింది. ఆ ఉత్తరంలో ఉదహరించబడిన అంతనీట్‌గా యాక్టివ్‌గా ఉండడం చూసి, వాళ్ళు తట్టుకోలేకపోయి ఉండాలి. వాళ్ళబ్బాయి దగ్గిర పని చేసే క్రింద మనిషిగా తప్ప మరోలా చూడలేకపోయి ఉండాలి. లోపలి కెళ్ళి రెండు ముక్కలు రాసి కవర్లో పెట్టి అంటించి ఇచ్చాడు.

"చూడమ్మాయ్ ... అరబస్తా బియ్యం మూట మావాడి కోసం సిద్ధం చేసి ఉంచాం. కొత్త మంచాలు ప్యాక్ చేయించి ఉంచాం. నువ్వెళ్ళేటప్పుడు ఇలా వచ్చి తీసుకెళ్ళి మావాడికి అందించు' ' అనే బరువు కూడా అమె మీద వేశారు.

ఓసారి ఎక్కితే ఎప్పుడెక్కడ ఆగిపోతామో ఎరగని ఈనాటి రైలు ప్రయాణాల్లో, అందులో ఇంత దూరం, అందున్నా ఓ ఆడపిల్లతో ఓ ఒంటరిఆడది, ఇంత భారం తలకెత్తుకోడం - అసాధ్యం అని ఆ క్షణమే నిర్ణయించుకుంది వసుంధర అవి తీసుకురాకుండానే బొంబాయి వచ్చేసింది.

"నా కెలా కుదురుతుంది?" అంటూ శివప్రసాదుతో స్పష్టంగా చెప్పింది.

అయితే ఉత్తరంలో ముసలాయన ఏం రాశాడో శివప్రసాదుకే ఎరిక, "ఏనాడో మొగుడు పోయి, ఏ నలభయ్యో దాటిన మనిషి, ఇప్పుడు విడిచిన పువ్వులా ఇలాగ్రటా ఉండడటం! దీనికా మనం ఉపకారం చెయ్యవలసింది ! బాగా మోజులో పడ్డట్టున్నావు, నీ సంసారానికి అపకారం కాకుండా చూసుకో."

అతని తల తీసేసినట్టయింది. వసుంధరలాంటి వ్యక్తికి తన లాంటివాడు ఏ సాయం చెయ్యకుండా ఉండటమే అన్నిటి కన్న గొప్ప సాయం!

*(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 4-5-91)*